


RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





అనకాపల్లి | సంపుటి: 3 | సంచిక: 229 | బుధవారం | 22-01-2025 | ఎడిటర్ : చింతమనేని అనీల్ కుమార్ | పేజీలు : 8 | వెల : 3.00


# కుర్చీల రచ్చ, ఆగేనా,రాష్టం ముందుకు నడిచేనా ?

- ఉప ముఖ్యమంత్రి అయినా పవన్ తొందరపాటు తగ్గలేదా?
- జగన్ జ్యోతిష్యాన్ని కూటమి నాయకులు నిజం చేస్తున్నారా?

**పెన్ సత్తా డెస్క్ :** 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, బిజెపి పార్టీ ముగ్గురు కూటమిగా ఏర్పడి రాష్ట్ర అభివృద్దే తమ ధ్యేయమని ప్రజలను నమ్మించి ప్రతిపక్ష హోదా కూడా వైసీపీ ని ఓడించి, భారీ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అంతటి ఘన విజయం సాధించిన కూటమి నాయకులు విజయ అహంభావంతో బాధ్యతలు మరిచి, కుర్చీలాట మొదలెట్టారు. ఒక పక్కన ఏపీ అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు, ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ పారిశ్రామిక వేత్తలను ఆకర్షించి, పరిశ్రమలను రప్పించడానికి కష్ట పడుతుంటే, మరో పక్క పార్టీ నాయకులు వారి శ్రమను నీరుగారేటట్టు, అంతర్గత







కీచులాటకు తెర తీస్తున్నారు. లోకేష్ ని డిప్యూటీ సీఎం చేయాలంటూ పార్టీ నేత రాజేష్ మహాసేన మొదలుపెట్టిన కీచులాటకు కొనసాగింపుగా ఇతర నేతలు రెడ్డప్పగారి శ్రీనివాసులు రెడ్డి, బుద్దా వెంకన్న, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఎస్వీఎస్ఎన్ వర్మ అందుకున్నారు. ఈ వివాదం పై నిన్న టీడీపీ అధిష్టానం స్పందించి ఈ ప్రచారానికి వెంటనే బ్రేక్ వేసింది. అయితే ఈ విషయం తెలియని మంత్రి టీజీ భరత్ దావోస్ లోనూ లోకేష్ సీఎం అంటూ వ్యాఖ్యలు చేసి సీఎం చంద్రబాబుతో తిట్లు తిన్నారు. అయితే టీడీపీ ఈ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గింది ? రాష్ట్రంలో కూటమిగా ఏర్పడి పోటీ చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ గతంలో ఒప్పందం చేసుకున్నాయి. అధికారం లోకి వస్తే చంద్రబాబు సీఎం, పవన్ కళ్యాణ్ కు డిప్యూటీ సీఎం ఇవ్వాలని, మిగతా నేతలకు ఇతర పదవుల పంపకాలు చేసుకోవాలని నిర్ణయించారు. అయితే దానికి భిన్నంగా అధికారం లోకి వచ్చిన ఆరు నెల ల్లోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కి సైతం ఇబ్బంది కలిగే విధంగా, అనాలోచిత, తొందరపాటుతో చేస్తున్న వ్యాఖ్యలే దీనికి కారణమనే చర్చ గట్టిగా జరుగుతోంది. పవన్ తొందరపాటు ఆపడానికి లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారాన్ని టీడీపీ తెరపై కి తెచ్చింది అనేది కూడ వినిపిస్తోంది. అదీ లోకేష్ వర్గంగా భావిస్తున్న వారితో ఈ ప్రచారం మొదలుపెట్టింది. తొలుత నామినేటెడ్ పదవుల కోసం నేతలు ఇలా వ్యాఖ్యలు చేస్తున్నారని భావించినా చివరికి దీని వెనుక వ్యూహం ఉందని అందరికీ అర్ధమైంది. వాస్తవానికి టీడీపీలో ఓ అనవాయితీ, లేక సంప్రదాయం ఉంది. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు తమకు అనుకూల మైన మీడియా లేదా నేతల ద్వారా జనం లోకి లీకులు ఇవ్వడం, దాని పై సానుకూలత వస్తే సదరు నిర్ణయం పై ముందుకు వెళ్లడం, రాకపోతే ఏదో కారణంతో వెనక్కి తగ్గడం ఎప్పటి నుంచో జరుగుతూనే ఉంది. ఇప్పుడు కూడా లోకేష్ ను డిప్యూటీ సీఎం చేసే విషయంలోనూ అదే జరిగిందన్న చర్చ జరుగుతోంది. అయితే ఇప్పుడు లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలన్న ప్రచారం పై వ్యతిరేకత ఎక్కడన్న అన్న ప్రశ్న ఎదురైంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏకైక డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఇప్పుడు ఉన్నట్లుండి లోకేష్ ను డిప్యూటీ సీఎం చేస్తే నష్టం కూడా ఆయనకే. గతంలో వైసిపి తెలివిగా ఐదుగురు డిప్యూటీ సీఎంలను చేసి వారికి ఎలాంటి అధికారాలు లేకుండా కేవలం పేరుకే అన్నట్లు కొనసాగించింది.


మిగతాది 2 లో...


## గ్రీన్ ఎనర్జీ లో ఆంధ్రాను ప్రపంచానికే ఆదర్శంగా మార్చబోతున్నాం చంద్రబాబు



**దావోస్ :** రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్ గా మార్చబోతున్నాం అని, రాష్ట్రంలో అభివృద్ధి పథంగా ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పారిశ్రామిక వేత్తలను ఆకర్షించి, ఆహ్వానించడానికి చంద్రబాబు దావోస్ పర్యటనలో వున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఉన్న సీఎం చంద్రబాబు నేడు ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండిస్టియ లైజేషన్ పై నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ భారతీయుల రక్తం లోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని అన్నారు. సదస్సులో ఉన్న అందర్నీ చూస్తుంటే తనలో నమ్మకం పెరిగిందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తన కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగిందన్నారు. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశామని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. 25 ఏళ్ల కిందట బిల్ గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారని తెలిపారు. 1991 లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టానని చంద్రబాబు తెలిపారు. 1999 లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకువచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయానని, ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని చంద్రబాబు తెలిపారు. 2014 లో మరోమారు ముఖ్యమంత్రి గా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్ పై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారని వెల్లడించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన, గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి పై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తి పైనా ఏపీలో ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధన వనరుల్లో వస్తున్నాయన్నారు. 500 మెగావాట్ల, 5 ఎంపీటీఏ గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నామని తెలిపారు. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీ–ఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాయని చెప్పారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోందని చంద్రబాబు ఆహుతలలో ఆసక్తి రేకెత్తించారు. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నాయన్నారు. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సాహకాలు అందిస్తుందని భరోసానిచ్చారు. పీఎం సూర్య ఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నామని వెల్లడించారు. అత్యంత తక్కువ ఖర్చు తోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటు లోకి రావాలని, ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉందని సూచించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయం పైనా దృష్టి పెట్టామని చంద్రబాబు తెలిపారు. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుందని అన్నారు. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సాహకాలు అందిస్తామని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరారు. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామిక వేత్తలే కనిపిస్తున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతీయులు ప్రపంచానికి అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నానన్నారు. భవిష్యత్ లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షను వెళ్ళబుచ్చారు.

## బిజెపి ఎంపిల పై కేసును కొట్టివేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ పెన్ సత్తా :** బిజెపి ఎంపిల పై నమోదైన క్రిమినల్ అక్రమ ప్రవేశం కేసును కొట్టి వేస్తున్నట్లు సుప్రీంకోర్టు మంగళవారం ధృవీకరించింది. 1934 ఎయిర్ క్రాఫ్ట్ చట్టం ప్రకారం విచారణ సమయంలో సేకరించిన సమాచారాన్ని నెల లోపు సంబంధిత అధికారులకు అందించేందుకు జస్టిస్ ఎ.ఎస్.ఓకా నేతృత్వం లోని ధర్మాసనం రాష్ట్ర పోలీసులను అనుమతించింది. ఎంపి లు, వారి సన్నిహితుల పై చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలా వద్దా అని ఇన్‌చార్జి అధికారి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. మూడేళ్ల క్రితం డియోఘర్ విమానాశ్రయం లోని తమ చార్టర్డ్ విమానం టేకాఫ్ ఆలస్య మైందంటూ బిజెపి ఎంపిలు నిషికాంత్ దూబే, మనోజ్ తివారీ సహా ఇతరులు అక్రమంగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) గది





లోకి ప్రవేశించారని జార?ండ్ ప్రభుత్వం కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్ విమానాన్ని టేకాఫ్ చేయడానికి అనుమతించాలంటూ నిందితులు ఎటిసి సిబ్బందిని బెదిరించడంతో పాటు వారి పై ఒత్తిడి తీసుకువచ్చారని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది.



చట్టం లోని సెక్షన్ 12 బి ప్రకారం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) వ్రాతపూర్వక అనుమతితో అధికారికంగా ఫిర్యాదు చేసిన తర్వాత మాత్రమే నేరాలను కోర్టు పరిగణించవచ్చని హైకోర్టు పేర్కొంది. ప్రస్తుత కేసులో అటువంటి ఫిర్యాదు లేనందున ఎఫ్ఐఆర్‌ను సమర్ధించలేమని జార?ండ్ హైకోర్టు పేర్కొంది. దీంతో హైకోర్టు నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టు ను ఆశ్రయించింది. ఎటిసి నిషిద్ధ ప్రాంతమని, విమానాశ్రయం లోని ఈ ప్రాంతం లోకి ప్రవేశించేందుకు నిందితులకు అధికారం లేదని జార?ండ్ ప్రభుత్వం తరపు న్యాయవాది పేర్కొన్నారు. ఈ కేసు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు గత ఏడాది డిసెంబర్ 18 న సుప్రీంకోర్టు పేర్కొంది. తమ విమాన క్లియరెన్స్ కోసం ఎటిసి గది లోకి ప్రవేశించినందుకు బిజెపి ఎంపిలు, సహ నిందితుల పై జార?ండ్ ప్రభుత్వం దాఖలు చేసిన నేరపూరిత అతిక్రమణ, ఇతరుల ప్రాణాలకు హాని కలిగించడం కేసును సుప్రీం కోర్టు కొట్టివేసింది.

## ముత్యాలమ్మపాలెం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 21:** విశాఖ ముత్యాలమ్మపాలెం సముద్ర తీరం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి సి.ఎం.రమేష్. గత డిసెంబర్ నెలలో జరిగిన పార్లమెంట్ సమావేశాలలో ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం. రమేష్ లోక్ సభ 377 నిబంధన కింద చర్చించిన విషయం విధితమే. ఈ అంశాన్ని సంబంధిత శాఖకు పరిశీలన నిమిత్తం పంపించడం జరిగిందని తెలియజేస్తూ కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అనకాపల్లి ఎంపీ కి లేఖ వ్రాశారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ వివిధ ప్రాంతాలలో పర్యాటకాభివృద్ధిని స్వదేశ్ దర్శన్ (ప్రసాద్) కింద చేపట్టే ప్రయత్నాలలో భాగంగా ముత్యాలమ్మపాలెం సముద్ర తీరాన్ని అభివృద్ధి చేసే పనిని చేపడుతుందని షెకావత్ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి అనేక పర్యాటక ప్రాజెక్టులను మంజూరు చేసిందని, వాటి కి సంబంధిచిన వివరణాత్మక నివేదికలు, నిధుల వినియోగ వివరాలు అందజేయవలసిందిగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం శాఖ కార్యదర్శిని కోరడం జరిగిందని ఈ లేఖ ద్వారా ఎంపీకి తెలియజేశారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని తెలిపిన కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కు ఎంపీ డాక్టర్ సి.ఎం. రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.



# సంపాదకీయం

## ప్రభుత్వ పాలసీల్లో ప్రపంచ బ్యాంకు

### పెట్టుబడులు, కార్పొరేట్లకు అడ్డు లేకుండా లైన్ క్లియర్

**అమరావతి పెన్ సత్తా బ్యూరో :** తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోంది. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పేరుతో ఆహార ఉత్పత్తులను తగ్గించడం(శ్రీలంక గతపాలసీ) ఇవన్నీ కూడా దండలో దారంలా ఒకదానికొకటి పెనవేసుకుపోయి ఉన్నాయి.




కొత్తగా తీసుకొచ్చే పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాలని ప్రతిపాదించారు. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ ఇందులో భాగమే. 2000 సంవత్సరంలో చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని చూసింది. ఇప్పుడు ఇదే పద్ధతిని అమల్లోకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఇండిస్టియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు.

రాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.

పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఏ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ప్లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు.

ఇక నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అర్జెంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !

ఇంటికొక్కరు ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కొత్త పల్లవి. ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. 2006లో కేంద్రం ప్రపంచబ్యాంకు నిధులతో తీసుకొచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) పథకం అప్పట్లో నిధులిచ్చే సమయంలో అర్బన్ రిఫార్మ్స్(పట్టణ సంస్కరణలు) తీసుకొచ్చింది. దీనిలో కీలకమైంది. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్‌ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.

మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది.

# కుర్చీల రచ్చ ఆగేనా,రాష్ట్రం ముందుకు నడిచేనా ?

**మొదటి పేజీ తరువాత...** తెలుగుదేశం కూడ అదేబాటలో నడిచి పవన్ డిప్యూటీ సీఎం పదవి శక్తిని, లోకేష్ రూపంలో మరో డిప్యూటీ సీఎం చేస్తే, మజ్జిగ పలుచన కావడం ఖాయం. అందుకే గత కొన్ని రోజులుగా టీడీపీ నేతలు లోకేష్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ ప్రచారం మొదలు పెట్టినా సైలెంట్ గా ఉన్న పవన్ నిన్న మాత్రం తిరుపతి నేత కిరణ్ రాయల్ తో కౌంటర్ ఇప్పించారు. లోకేష్ డిప్యూటీ సీఎం కావాలని టీడీపీ నాయకులు ఎలా కోరుకుంటున్నారో, అలాగే జనసేన నాయకులు కూడా పవన్ కళ్యాణ్ సీఎం కావాలని కోరుకుంటున్నారని తిరుపతి జనసేన ఇన్ ఛార్జ్ కిరణ్ రాయల్ చేసిన వ్యాఖ్యలు ఘాటు కౌంటర్ లా మారాయి. ఈ వ్యాఖ్యల ప్రభావం తోనే టీడీపీ వెంటనే అప్రమత్తమై లోకేష్ డిప్యూటీ సీఎం ప్రచారం ఆపాలంటూ నేతలకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే మిగతా నేతలు సైలెంట్ అయినా విషయం తెలియని మంత్రి టీజీ భరత్ ఏకంగా దావోస్ లోనే, సీఎం చంద్రబాబు ముందే ఎవరు ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా లోకేష్ కాబోయే సీఎం అన్నారు. భరత్ వ్యాఖ్యల్ని పక్కనబెడితే టీడీపీ ఇలా వెనక్కి తగ్గడం వెనుక పవన్ ప్లాన్ సక్సెస్ అయిందన్న ప్రచారం కూడ  జరుగుతోంది. గత ఐదు సంవత్సరాలు ప్రజలకు సంక్షేమం పేరుతో వైఎస్‌ఆర్సిపి  డబ్బులు విరివిగా పంచినా రాష్ట్ర ప్రజలకు వారు నడిచిన వ్యవహారం నచ్చక ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా చేశారు. బాధ్యతను మరిచి కూటమి నాయకులు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కుర్చీలో కోసం కుస్తీ పడితే రాబోయే ఎన్నికల్లో ప్రజలకు కూడా తెలుసు ఎవరిని ఎక్కడ కూర్చోబెట్టాలో  అనే విషయం. రాష్ట్రంలో కొత్తగా కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పదవి పై రచ్చ మొదలైంది. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి, విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలని టీడీపీ ముఖ్య నేతలు డిమాండ్ చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న ఈ డిమాండ్ పై జనసేన, పవన్ మద్దతు దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ కు మాత్రమే ఆ హోదా ఉంటుందని చెప్పి, ఇప్పుడు లోకేష్ గురించి ప్రతి పాదన చేయటం పైన జన సైనికులు మండి పడుతున్నారు. ఇదే అంశం పైన సోషల్ మీడియా వేదికగా పవన్ – లోకేష్ మద్దతు దారుల మధ్య వార్ ముదురు తోంది. ఇదే సమయంలో ఏపీలో తాజా పరిణామాల పైన బీజేపీ నాయకత్వం తమ వైఖరిని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. డిప్యూటీ సీఎంగా జనసే నాని పవన్ ప్రస్తుతం ఉన్నారు. డిప్యూటీ సీఎం అయినా పవన్ కళ్యాణ్ తొందరపాటు తనంతో  హోం మంత్రి పైన వ్యాఖ్యలు, తిరుపతి తొక్కిసలాట ఘటనలో పవన్ స్పందించిన తీరుతో ప్రభుత్వం పడుతున్న ఇబ్బందులతో కొత్త రాజకీయం మొదలైంది. పవన్ చేస్తున్న వ్యాఖ్యలతో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడు తోందనే అభిప్రాయం టీడీపీ నేతల్లో మొదలైంది. దీంతో, నేరుగా పవన్ ను టార్గెట్ చేయకుండా పవన్ తో పాటుగా లోకేష్ కు డిప్యూటీ సీఎం హోదా ఇవ్వాలనే డిమాండ్ వ్యూహాత్మకంగా తెర మీదకు తీసుకొచ్చారు. అయితే, పవన్ హోదా తగ్గకుండా మరెవరికీ డిప్యూటీ సీఎం హోదా ఇవ్వకూడదని గతం లోనే నిర్ణయించారు. తెలంగాణ, కర్ణాటక లోనూ భట్టి, డీకే శివకుమార్ విషయం లోనూ ఇదే ఫార్ములా అమలు చేస్తున్నారు. సోషల్ మీడియాలో వార్ కాగా, కొద్ది రోజులుగా టీడీపీ నేతలు వరుసగా లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలంటూ వరుస డిమాండ్లు చేస్తున్నారు. తిరుపతి లో తొక్కిసలాట ఘటనలో పవన్ టీటీడీ బోర్డు, అధికారులు క్షమాపణ చెప్పాలని పవన్ డిమాండ్ చేసారు. దీని పైన లోకేష్ స్పందించిన తీరు సైతం చర్చగా మారింది. పవన్ డిమాండ్ తో టీడీపీకి సంబంధం లేదని లోకేష్ వ్యాఖ్యానించారు. ఇక, తాజాగా చంద్రబాబు సమక్షం లోనే టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేసారు. దీని పైన చంద్రబాబు స్పందించ లేదు. దీనికి మద్దతుగా పిఠాపురం నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వరుసగా టీడీపీ ముఖ్య నేతలు తెర పైకి వచ్చారు. లోకేష్ కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని కోరుతున్నారు. ఢిల్లీ నేతల ఆరా డిప్యూటీ సీఎం పదవి పవన్ తో పాటుగా లోకేష్ కు ప్రతిపాదించటం పైన జనసైనికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవన్ ఏ విధంగా కూటమి అధికారం లోకి రావటానికి కారణమయ్యారో వివరిస్తూ పోస్టింగ్స్ పెడుతున్నారు. దీంతో, సోషల్ మీడియా వేదికగా టీడీపీ, జనసేన మద్దతు దారుల మధ్య వార్ కొనసాగుతోంది. ఇదే సమయంలో ఈ వివాదం పైన బీజేపీ అధినాయకత్వం ఆరా తీసినట్లు సమాచారం. పదవుల విషయంలో చర్చలతో పరిష్కరించుకోవాలని. కూటమి సఖ్యత పై ప్రభావం పడేలా ఉండకూడదని వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ఈ వివాదం పై చంద్రబాబు, పవన్ స్పందించ లేదు. దీంతో ఈ రచ్చ రానున్న రోజుల్లో ఎలాంటి టర్న్ తీసుకుంటుందనేది ఆసక్తి కరంగా మారుతోంది.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాల నిర్వహణ

**పరవాడ, పెన్ సత్తా, జనవరి 21:** ఈ నెల 20 నుండి నెలాఖరు వరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు సంవర్ధక శాఖ పరవాడ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరక్టర్ డా.రామకృష్ణ కీర్తి తెలియజేసారు. ఈ సందర్భంగా పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు పశు ఆరోగ్య శిబిరాల గోడ పత్రికను ఆవిష్కరించారు. పాడి రైతులందరూ ఈ పశు వైద్య శిబిరాలలో నిర్వహించే పశువులకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు త్రాగించడం, వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశం వ్యాధులకు చికిత్సలు పశువైద్య నిపుణులు అందజేస్తారని పశు వైద్యులు ఎమ్మెల్యే కి తెలియజేసారు. అనంతరం శాసన సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేబడుతున్న ఈ ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకొని తమ పాడిని అభివృద్ధి చేసుకోవాలని తమ సందేశాన్ని అందించారు. అనంతరం పెద ముషిడివాడలో నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాలలో 390 పశువులకు నట్టలు నివారణకు మందులు ఇవ్వడం, వ్యాధి నిరోధక టీకాలు వేయడం, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు, గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పరవాడ పశు సంవర్ధక శాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరక్టర్ డా.రామకృష్ణ కీర్తి, డా.సురేష్ కుమార్, డా.అశ్విని ప్రపుల్లా, డా. రవి కుమార్, డా.జగన్, పశు సంవర్ధక శాఖ సహాయకులు బాలాజీ, భాస్కర్, కృష్ణ పాల్గొన్నారు.







# 30 ఏళ్ళ తరువాత ఆత్మీయ కలయిక

**అచ్చుతాపురం పెన్ సత్తా :** లాలం కోడూరు లోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 1994–1995 పదవ తరగతి విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ పూర్వ స్నేహితుల ఆత్మీయ కలయిక అనేది తమ బాల్య జీవితంలో మధుర క్షణాలను గుర్తుచేసుకునే మంచి సందర్భం. ఈ కలయిక ద్వారా వీరు బాల్యంలో జరిగిన గత అనుభవాలను పంచు కొంటూ, మళ్లీ ఆ స్నేహ బంధాలను మెరుగు పరుచు కోవడానికి, నవ్వులతో, ఆనందంతో మమేకమై వీరు సంతోషంగా గడిపారు.



వీరంతా పదవ తరగతి పూర్తి చేసిన తర్వాత వారి 30 ఏళ్ళ జీవితంలో జరిగిన జీవిత గాథను పక్కన పెట్టి, అన్నీ మరిచి తమ చిన్ననాటి బాల్య స్నేహితులతో కాలచక్రంలో వెనక్కి వెళ్లి మధుర మధుర స్మృతులను గుర్తు చేసుకుంటూ, ఆట పాటల తో, విందు భోజనాలతో ఆనందంగా గడిపారు. ఇటువంటి కార్యక్రమాలు అనతికారంగా జరుగుతున్న గాని ఈ మధ్యకాలంలో పూర్వ విద్యార్థుల కార్యక్రమం బాగా ప్రాచుర్యం పొందుతుంది. ఇటు వంటి కార్యక్రమాలు మనిషిలో మరుగును పడిపోతున్న మంచితనం, మానవత్వం, సమాజ శ్రేయస్సు కోసం ఆలోచించడం లాంటి విషయాలను తట్టి లేపుతున్నాయి. ఇటువంటి కార్యక్రమాల్లో వీరు ఒక కూటమిగా ఏర్పడి వీరంతా ఒక నిధిని ఏర్పాటు చేసుకుని, ఈ కూటమిలో ఏ కుటుంబాని కైనా విపత్కర పరిస్థితులు, విషాదఘటనలు జరిగితే వారికి ఆ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేయడం లాంటి మహత్తర కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పూర్వ స్నేహితుల ఆత్మీయ కలయిక లాగే పూర్వ స్నేహితుల కుటుంబ సభ్యులతో ఆత్మీయ కలయిక కార్యక్రమం ఇక ముందు ప్రారంభం కావలసి ఉంది. ఇటువంటి కార్యక్రమాలు వారి కుటుంబాలతో పాటు, సమాజ మంచికి కూడా ఎంతో ఉపయోగపడతాయి.





# పవన్ ఎ సీఎం జనసేన నేత పోస్ట్

**పెన్ సత్తా డెస్క్ :** ఏపీ లో డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉండగా మరో డిప్యూటీ సీఎం గా టీడీపీ నేత నారా లోకేష్ ను నియమించాలనే డిమాండ్లు ఈ మధ్య బలంగా వినిపిస్తున్నాయి. అయితే నిన్న టీడీపీ అధిష్టానం వీటికి తాత్కాలికంగా చెక్ పెట్టింది. అదే సమయంలో తెలంగాణకు చెందిన జనసేన నేత ఒకరు పవన్ కళ్యాణ్ ఏకంగా కాబోయే ముఖ్యమంత్రి అంటూ సోషల్ మీడియాలో ఓ పోస్టు పెట్టారు. అంతే కాదు దీని పై తనకు ఢిల్లీ నుంచి సమాచారం ఉందన్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రస్తుతం రాష్ట్రంలో ఏకైక డిప్యూటీ సీఎంగా ఉన్నారు. అయితే ఆయన కొద్దినెలల్లో ముఖ్యమంత్రి కాబోతున్నట్లు జనసేన వైరా నియోజకవర్గ ఇన్ ఛార్జ్, ఓయూ జేఏసీ అధ్యక్షుడు సంపత్ నాయక్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్టు పెట్టారు. ఢిల్లీ విశ్వసనీయ వర్గాల మేరకు కొద్ది నెలల్లో పవన్ కళ్యాణ్ సీఎం కాబోతున్నారు అని సమాచారం అంటూ ఆయన ట్వీట్ చేశారు. దీంతో ఈ ట్వీట్ సంచలనం రేపుతోంది. దీని తర్వాత తెలంగాణ జనసేన నేత సంపత్ నాయక్ మరో సంచలన ట్వీట్ కూడా పెట్టారు. ఇందులో ఆయన వేరే కులం వాడు ముఖ్యమంత్రి కాకూడదా? అని, మెజారిటీ సంఖ్య ఉన్న ప్రజలందరూ సరైన నాయకుడిని ఎందుకు ఎన్ను కోలేకపోతున్నారు అని ప్రశ్నించారు. తద్వారా పవన్ కళ్యాణ్ కు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాల్సిందేనని ఆయన పరోక్షంగా సూచించారు. అలాగే ఏపీలో ఉన్న కుల రాజకీయాన్ని కూడా ఈ ట్వీట్ తో ప్రశ్నించారు. లోకేష్ డిప్యూటీ సీఎం ప్రచారానికి టీడీపీ ఫుల్ స్టాప్ పెట్టినా అది రేపిన చిచ్చు ఇప్పుడు జనసేన నాయకులు ఆరనిచ్చేలా కనిపించడం లేదు.

# నేడు మంత్రి కొల్లు రవీంద్ర చోడవరం రాక

**చోడవరం పెన్ సత్తా జనవరి 21:** అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర ఎక్సైజ్ మరియు గనుల శాఖ మంత్రి కొల్లి రవీంద్ర బుధవారం చోడవరం మండలానికి రానున్నారు. స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు, మంత్రి కొల్లి రవీంద్ర ముందుగా మండలంలోని గంధవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న విత్తన పరిశోధన మరియు అభివృద్ధి కేంద్రాన్ని పరిశీలించి అనంతరం చోడవరం చక్కర కర్మాగారాన్ని సందర్శిస్తారు. ఫ్యాక్టరీ క్రషింగ్ సరళిని పరిశీలించి, కార్మికులకు, రైతులకు చెల్లించవలసిన బకాయిలు కోసం ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడుతారు. ఫ్యాక్టరీకి రావలసిన బకాయిలు, రైతులకు చెల్లించవలసిన బకాయిలు, కార్మికులకు చెల్లించవలసిన జీతాలు, రిటైర్డ్ కార్మికులకు ఏడాది నుండి చెల్లించవలసిన గ్రాట్యుటీ గురించి వివరాలు తెలుసుకొని ప్రభుత్వం నుండి ఆదుకోవడానికి మాట్లాడుతారు. అనంతరం 5 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగి మధ్యలో ఆగిపోయిన చోడవరంలోని తాసిల్దార్ కార్యాలయం, జిల్లా కోర్టు భవనం, రైతు బజార్ పనులు పరిరక్షించి అవసరమైన నిధులు కోసం ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజుతో చర్చిస్తారు. మంత్రి రాకతో నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలు పరిష్కారం అవుతాయని పలువురు ఆశిస్తున్నారు. ముఖ్యంగా చోడవరం చక్కెర కర్మాగారం ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నందున జిల్లా ఇన్చార్జి మంత్రి సందర్శన ఫ్యాక్టరీ కార్మికులకు, రైతులకు మేలు జరగడానికి తీపి కబురు చెప్పే అవకాశం ఉందని అంటున్నారు.



# వివాదాస్పద అంశాలను పక్కన పెట్టి పాలన పై దృష్టి నిమ్మల

**పాలకొల్లు, పెన్ సత్తా జనవరి 21 :** రాష్ట్రంలో సిఎం, డిప్యూటీ సీఎం లాంటి వివాదాస్పద అంశం పక్కన పెట్టి పరి పాలన పై నాయకులు శ్రద్ధ వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లు మున్సిపాలిటీలో మంగళవారం అభివృద్ధి పనులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ 2014–19 లో టిడిపి ప్రభుత్వం కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు, గత ప్రభుత్వం హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురయ్యాయి అన్నారు. తిరిగి ఆ పనులను పూర్తిచేసేలా దృష్టి పెట్టాం అన్నారు. గత జగన్ మోహన రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో 14 – 15 వ ఆర్థిక సంఘం నిధులు, కోట్ల రూపాయలను దారి మళ్లించి పురపాలక సంఘాలను నిర్వీర్యం చేసిందన్నారు.



చెత్త మీద కూడా పన్ను వేసి ప్రజల పై భారం మోపిన వైసిపి చెత్త పాలన చూశాం. జగన్ చెత్త పాలనతో 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అప్పగించకుండా బ్యాంకులో తాకట్టు పెట్టి 5 వేల కోట్లను దారి మళ్లించి లబ్ధిదారుల నెత్తిన అప్పుల భారం మోపారు. 80 శాతం పైన పూర్తయి ఉన్న టీడ్కో ఇళ్ళను వెంటనే పూర్తి చేసి పేదలకు అందజేయమని సిఎం ఆదేశించారు. స్వచ్ఛ భారత్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులకు గత వైసిపి ప్రభుత్వం రాష్ట్ర వాటా కూడా కనీసం చెల్లించక పోవడం తోనే చెత్త పేరుకుపోయి అనారోగ్యపు ప్రదేశ్ గా మారింది అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నరసాపురం ఆర్డిఓ దాసిరాజు మున్సిపల్ కమిషనర్ విజయ సారధి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మూడో ప్రపంచ యుద్ధం రానివ్వను

**వాషింగ్టన్ :** మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హామీ ఇచ్చారు. దేశ సరిహద్దుల అతిక్రమణను నిరోధిస్తానని చెప్పారు. బాధ్యతలు చేపట్టిన కొద్ది గంటల వ్యవధిలోనే మాజీ అధ్యక్షుడు జో బైడెన్ తీసుకున్న కార్యనిర్వాహక చర్యలన్నింటినీ రద్దు చేస్తానని స్పష్టం చేశారు. టిక్‌టాక్ ఉమ్మడి భాగస్వామ్యంలో అమెరికాకు యాభై శాతం వాటా ఉంటుందని ప్రకటించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ముందు వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ వన్ అరేనాలో జరిగిన మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా) విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. 'అమెరికా చరిత్రలో ఏ అధ్యక్షుడు చేయని విధంగా ప్రజలకు అత్యుత్తమమైన మొదటి రోజును, అతి పెద్ద మొదటి వారాన్ని, అత్యంత అసాధారణమైన తొలి వంద రోజులను అందించబోతున్నాము' అని ఆయన చెప్పారు. 'రేపు సాయంత్రం సూర్యాస్తమయం అయ్యే లోగా మా దేశంపై అక్రమ వలసదారుల దాడిని నిలిపేస్తాం. సరిహద్దులను అతిక్రమించి అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్న వారు తిరిగి స్వస్థలాలకు పోవాల్సిందే. మా సంపదను తిరిగి దక్కించుకుంటాం' అని ట్రంప్ అన్నారు. అధికార యంత్రాంగం త్వరలోనే దేశ సరిహద్దులను తన నియంత్రణలోకి తీసుకుంటుందని చెప్పారు. అమెరికా చరిత్రలోనే అతి పెద్దదైన 'బహిష్కరణ' ప్రక్రియను ప్రారంభిస్తామని తెలిపారు. వేలాదిమంది అక్రమ ఇమ్మిగ్రెంట్లను స్వదేశాలకు పంపుతామని ఆయన స్పష్టం చేశారు. 'దానికి ముందు బహిరంగ సరిహద్దులు, కారాగారాలు, మానసిక సంస్థలు, మహిళల క్రీడల్ని పురుషులు ఆడడం, ట్రాన్స్‌జెండర్ల గురించి కనీసం ఎవరూ ఆలోచించనైనా ఆలోచించరు. అమెరికా భూభాగంలో అక్రమంగా నివసిస్తున్న వారిని, వలస వచ్చిన నేరగాళ్లను బహిష్కరిస్తాం' అని చెప్పారు.



# చోడవరం షుగర్స్ లో క్రస్సింగ్ ప్రారంభం

**చోడవరం పెన్ సత్తా జనవరి 21:** చోడవరం చక్కెర కర్మాగారంలో 2024–2025 సీజన్ కు గాను రెగ్యులర్ క్రస్సింగ్ మంగళవారం ప్రారంభించారు. గత నెల 25న క్రసింగ్ ముహూర్తం చేయగా ఇప్పుడు రెగ్యులర్ క్రసింగ్ ప్రారంభమైంది. ఈ సీజన్లో లక్ష 50 వేల టన్నులు చెరుకు గానుగ ఆడి 9.5 శాతం రికవరీ సాధించడానికి ఫ్యాక్టరీ యాజమాన్యం సన్నాహాలు చేస్తుంది. ఫ్యాక్టరీకి గేటు ఏరియా నుండి, కొన్ని కాటాల నుండి చెరుకు వస్తుండగా, మిగిలిన కాటాల నుండి కూడా చెరుకు రప్పించడానికి ఫ్యాక్టరీ ఎండి వీఎస్ నాయుడు, సిడిఓ కలిమి రామం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే గత సీజన్లో చెరుకు సప్లై చేసిన రైతులకు చెల్లించవలసిన బకాయి టన్నుకు రూ 350 కాగా, ఇటీవల రూ 200 చొప్పున రైతుల బ్యాంకు ఖాతాలకు వేశారు. మిగిలిన సొమ్ము కూడా వేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



# బిజెపి జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరావుకు శుభాకాంక్షలు

**చోడవరం పెన్ సత్తా జనవరి 21:** భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు రెండవ సారి జిల్లా అధ్యక్షునిగా ఎన్నిక కావడంతో చోడవరం ప్రాంతానికి చెందిన పలువురు బిజెపి నాయకులు ఆయనకు సత్కారం చేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పరమేశ్వరావుకు చోడవరం నియోజకవర్గం ఇంచార్జ్ కందర్ప రమణమూర్తి, సీనియర్ నాయకులు దేవరపల్లి చంటి, గల్లా రాజేశ్వరరావు, ఎర్రంశెట్టి గోపి, శరగడం వెంకటరావు (ఎమ్మెల్యే వెంకట్రావు), మర్లోతు భాస్కరరావు, సీతా నాగరాజు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.



## ఎడ్లవీధిలో త్రాగునీటి సమస్య పరిష్కారం

**చోడవరం పెన్ సత్తా జనవరి 21:** స్థానిక ఎడ్లవీధిలో రెండు వాటర్ ట్యాంకులకు వెళ్ళవలసిన పైప్ లైన్ లీక్ కావడంతో పంచాయతీ సిబ్బంది బాగు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో త్రాగునీటి సమస్య పరిష్కారం అయింది. ఆ ప్రాంతానికి చెందిన కొందరు పంచాయతీ ఈవో కే.వి.వి.ఎస్ నారాయణరావుకు, సర్పంచ్ బండి నూకాలమ్మ శ్రీను, వార్డ్ మెంబర్ ఓరుగంటి నాగమణి నెహ్రూలకు తెలియజేయడంతో పంచాయతీ సిబ్బంది గండి నాయుడు తదితరులు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు. దీంతో ఆ ప్రాంతవాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఇక్కడే చదువుకొని... ఇక్కడ అభివృద్ధి చేయడం నా అదృష్టం

**చోడవరం పెన్ సత్తా జనవరి 21:** అక్కడే చదువుకొని ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయిస్తుండడంతో ఆ పంచాయతీ వార్డ్ మెంబర్, టిడిపి నాయకులు ఎ.దివ్య శేషు సంతోషంతో ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చోడవరంలోని కొత్తూరు జంక్షన్ నుండి పిఎస్ పేట రోడ్డు వేయిస్తున్నారు. స్థానిక కోటవీధికి చెందిన ఎ.దివ్య శేషు దగ్గరుండి ఆ ప్రాంతంలో రోడ్లు వేయిస్తుండడంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. చోడవరం గర్ల్స్ హైస్కూల్లో చిన్నప్పుడు చదువుకొని ఇప్పుడు ఆ ప్రాంతానికి చెందిన రోడ్లు వేయిస్తుండడం ఆనందంగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు సహకారం వలనే అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే గర్ల్స్ హైస్కూల్లో కూడా చైర్మన్ గుమ్మాల సత్య సత్తిబాబు ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా గర్ల్స్ హైస్కూల్ చైర్మన్ గుమ్మాల సత్య సత్తిబాబు మాట్లాడుతూ.... ఇంత కాలానికి పి.ఎస్ పేట రోడ్డుకు మోక్షం కలుగుతుందని, ఎమ్మెల్యే కే.ఎస్.ఎన్.ఎస్ రాజు ప్రోత్సాహం వలన చోడవరం పట్టణంలోనూ, మండలంలోని పలు గ్రామాల్లోని సిసి రోడ్లు కాలువలు నిర్మాణం జరుగుతున్నాయని తెలిపారు.



## నరేంద్ర సింగ్ బేడి భౌతిక కాయానికి నివాళులర్పించిన మంత్రి సవిత

**- ఉన్నత చదువులు చదివి, నిరుపేదలకు అండగా నిలిచిన వ్యక్తి నరేంద్ర బేడీ.**


**పెనుకొండ, పెన్ సత్తా, జనవరి, 21:** పెనుకొండ మండలం గుట్టూరు గ్రామం వద్ద యంగ్ ఇండియా ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ నిర్మాత నరేంద్ర సింగ్ బేడి అకాల మృతి పట్ల రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత విచారం వ్యక్తం చేశారు. ఇండియా ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ నిర్మాత నరేంద్ర సింగ్ బేడి ఇంటి వద్ద అయన భౌతిక కాయానికి పూలమాల వేసి మంత్రి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ మంత్రి మాట్లాడుతూ బేడీ ఇండియా ప్రాజెక్ట్ స్వచ్ఛంద సంస్థ నెలకొల్పి, ఎన్నో సామాజిక కార్యక్రమాలు, అనుబంధ వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటు చేసి, ఎన్నో ఉద్యమాలు చేసి అణగారిన వర్గాల ఆశాజ్యోతి నరేంద్ర సింగ్ బేడి చనిపోవడం బాధాకరం అన్నారు. ఎన్నో పోరాటాలు చేసి పేదల, ప్రజల హక్కులను కాపాడి సమసమాజ స్థాపన కోసం జీవితాన్ని, ఆస్తిని ధారా పోసి త్యాగం చేసిన వ్యక్తి అనికొనియాడారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం మన రాష్ట్రాని కి రావడానికి కృషి చేసిన వ్యక్తి అని, నరేంద్ర సింగ్ బేడీ సేవలను మంత్రి సవిత ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## బిజెపి నూతన జిల్లా అధ్యక్షునికి శుభాకాంక్షలు తెలిపిన బిజెపి నాయకులు

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 21:** శ్రీ సత్య సాయి జిల్లా పుట్టపర్తి లో జరిగిన సమావేశంలో గోరంట్లకు చెందిన జి.ఎం.శేఖర్ ను రెండవసారి బిజెపి జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకోవడం పట్ల జిల్లా వ్యాప్తంగా ఉన్న మండల అధ్యక్షులు బిజెపి నాయకులు పూర్తి మద్దతు పలికి ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి నాయకులు అంబటి సతీష్ ,జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు నూతన జిల్లా అధ్యక్షులకు పూల బొకే అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నాగభూషణం,మల్లికార్జున, కొండమీద రాయుడు, మంజునాథ్, ప్రదీప్, మహేష్, నాగరత్నమ్మ, రాధమ్మ, శారదమ్మ, మహాలక్ష్మి ,మంజుల తదితరులు పాల్గొన్నారు.



## ధర్మవరం నుంచి వలసలు కాదు ధర్మవరంకే వలసలు రావాలి

- ☑ ధర్మవరం అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది...పరిటాల శ్రీరామ్
- ☑ అందుకే వైసిపి నుంచి టిడిపిలోకి వస్తున్నారు
- ☑ పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో లోనికోట నుంచి పెద్ద ఎత్తున టిడిపిలో చేరికలు
- ☑ ధర్మవరంలో మహిళలు, యువతకు ఉపాధి కల్పిస్తాం

**– పరిటాల శ్రీరామ్**

**ధర్మవరం జనవరి 21 (పెన్ సత్తా న్యూస్):** ధర్మవరం నియోజకవర్గం నుంచి బయట ప్రాంతాలకు వలసలు వెళ్లడం చూశామని అయితే ఇక నుంచి ధర్మవరం ప్రాంతానికి ఇతర ప్రాంతాల నుంచి వలసలు వచ్చేలా చేద్దామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని లోనికోట ప్రాంతానికి చెందిన వైసిపి నాయకుడు అమర్ తో పాటు 50 కుటుంబాల వారు పరిటాల శ్రీరామ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. లోనికోటలో పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పరిటాల శ్రీరామ్ కు కాలనీవాసులు ఘన స్వాగతం పలికారు.శ్రీరామ్ అమర్ తో పాటు 50 కుటుంబాల వారికి తెలుగుదేశం పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానం పలికారు.ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ పార్టీలోకి వచ్చిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు.నేను ధర్మవరం నియోజకవర్గానికి వచ్చినప్పుడు లోనికోట వాసులు మేమున్నామంటూ ధైర్యం ఇచ్చి ముందుకు నడిపించారని దానిని ఎప్పటికీ మరువబోనన్నారు. ఒకప్పుడు పరిటాల రవికి ఆ తర్వాత పరిటాల సునీతమ్మకు లోనికోట వాసులు అండగా నిలిచిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ధర్మవరం ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నాయన్నది గతంలోనే చాలామంది నా దృష్టికి తీసుకువచ్చారని వీటిని పరిష్కరించే దిశగా ఇప్పుడు ప్రస్తుత ప్రభుత్వం పని చేస్తోందని శ్రీరామ్ అన్నారు. ఐదేళ్ల వైసిపి




పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు విధ్వంసం అయ్యాయని.వీటిని సరిదిద్దుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు.సూపర్ సిక్స్ పథకాల్లో ఇంకా కొన్ని అందడం లేదని చాలామంది చెబుతున్నారని.. అయితే రాష్ట్రాన్ని దారుణమైన పరిస్థితుల నుంచి గట్టెక్కించే విధంగా చంద్రబాబు ముందుకు వెళ్తున్నారని అన్నారు.ముందు రాష్ట్రం కుదుటపడ్డాక ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని శ్రీరామ్ అన్నారు. ధర్మవరం ప్రాంతంలో చాలామంది మహిళలకు ఉపాధి లేదని.. ఇక్కడ వారి కోసం ప్రత్యేకంగా స్టిచ్చింగ్ యూనిట్స్ ను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. మరోవైపు చాలామంది యువత చేనేత రంగంలో సరైన గిట్టుబాటు ధరలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళుతున్నారని.వీటి నివారణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ధర్మవరంలో కొత్తగా ఏమీ ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదని ఇక్కడ చేనేత పరిశ్రమను కాపాడితే ఇతర ప్రాంతాల వారు కూడా ఇక్కడికే వచ్చే బ్రతికే పరిస్థితి ఉంటుందన్నారు. మహిళలు, యువతకు ఉపయోగపడే విధంగా భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. మరోవైపు ధర్మవరం పట్టణవాసులు పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ముందుగా మన ఇంటి నుంచే పరిశుభ్రత ప్రారంభం కావాలన్నారు. చెత్తను ఎక్కడ బడితే అక్కడ వేయవద్దని పరిటాల శ్రీరామ్ సూచించారు. అయితే చాలా చోట్ల చెత్త వాహనాలు రావడం లేదని శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లగా..తానే సొంతంగా 100 డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తానని సూచించారు. క్లీన్ అండ్ గ్రీన్ ధర్మవరం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని శ్రీరామ్ పిలుపునిచ్చారు.

## హెల్మెట్, సీటు బెల్టుతోనే వాహనాలను నడపాలి

**- రూరల్ ఎస్సై శ్రీనివాసులు**

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 21:** ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ లేదా సీటు బెల్టుతో వాహనాలను నడపాలని రూరల్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని గొట్లూరు గ్రామ ప్రజలకు అవగాహన ర్యాలీని వారు నిర్వహించారు.ఈ సందర్భంగా గొట్లూర్ జడ్పీ హైస్కూల్ విద్యార్థులచే పట్టణములో ర్యాలీ నిర్వహిస్తూ మానవహారాన్ని నిర్వహించడం జరిగింది. అనంతరం రూరల్ ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రాఫిక్ నియమ నిబంధనలు, డ్రైవింగ్ పై పూర్తి అవగాహన లేకపోవడంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం సేవించి నడపరాదని, సెల్ ఫోన్ తో డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. అలా చేసినచో ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలను (మైనారిటీ) కు టూవీలర్లు ఇచ్చి వాహనాలు నడిపించినచో తల్లిదండ్రులతో పాటు జరిమానా తో పాటు కేసులు కూడా నమోదు చేస్తామని తెలిపారు.కావున ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించి ప్రమాద రహిత ప్రయాణం చేయాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## మెట్రోకెమ్ కంపెనీలో అగ్నిప్రమాదం ప్రమాదం

**అనకాపల్లి పెన్ సత్తా జనవరి 21:** మంగళవారం ఉదయం 6:45 గంటలకు జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ లోని మెట్రోకెమ్ ఏపీ ప్రైవేట్ లిమిటెడ్‌లో అగ్నిప్రమాదం సంభవించినట్లు పరిశ్రమలు జనరల్ మేనేజర్ జి. నాగరాజా రావు తెలిపారు. ఈటీపీ ట్యాంక్ టెర్రస్ ఏరియాలో మంటలు చెలరేగడంతో పాటు హెచ్‌డీపీ డ్రమ్ములకు మంటలు అంటుకున్నాయని, ఈ ఘటనలో కార్మికులు ఎవరు గాయపడ లేదని, తెలిపారు. 15-20 నిమిషాలలో అంతర్గత అగ్నిమాపక పరికరాలు, రామ్ కి ఫైర్ టెండర్ సహాయంతో మంటలు పూర్తిగా ఆర్పివేయడం జరిగిందని తెలిపారు. ప్రమాద సంఘటన పై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ విచారణకు ఆదేశించారని, దర్యాప్తు అనంతరం నివేదిక సమర్పించడం జరుగుతుందన్నారు.



# ఉచిత కంటి ఆపరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన

## - ఎన్డీఏ కార్యాలయమంత్రి ఇంచార్జ్ హరీష్ బాబు

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 21:** ధర్మవరంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ సహకారంతో, 22వ వార్డు నాయకులు ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో శాంతిరాం ఐ హాస్పిటల్ కర్నూల్ వారిచే ధర్మవరం పట్టణంలోని ప్రజల కోసం ఎమ్మార్వో ఆఫీస్ విశ్రాంత ఉద్యోగుల కార్యాలయ ఆవరణ నందు ఏర్పాటుచేసిన ఉచిత కంటి ఆపరేషన్ కార్యక్రమాన్ని ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇంచార్జ్ హరీష్ బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించడానికి ఆధునిక సౌకర్యాలతో ఏర్పాట్లు చేసి ప్రతి ఒక్కరికీ ఆరోగ్యకరమైన దృష్టి కోసం మేము ఈ ఉచిత కంటి ఆపరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించాం అని తెలిపారు.ఇది కంటి లోపం ఉన్న నిరుపేద,అర్హులైన వ్యక్తులకు ఒక మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఎంతో ప్రజావాదం కలిగిస్తుందని, దీనివల్ల ఎవరైనా కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచిత సేవలు అందిపుచ్చుకోగలుగుతారని అభిప్రాయపడ్డారు. అలాగే వారి ఆరోగ్య సంక్షేమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# ఎన్.టి.ఆర్.పై కవితల పోటీలో...

## - ధర్మవరం కవి ఎల్.ప్రఫుల్ల చంద్ర కు లేపాక్షి ఫౌండేషన్ ప్రశంసా పత్రం!

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 21:** అనంత లేపాక్షి ఫౌండేషన్ వారు ఇటీవల ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి దివంగత నట రత్న పద్మశ్రీ ఎన్.టి.రామారావు వర్ధంతి సందర్బంగా కవితల పోటీ నిర్వహించడం జరిగింది.ఈ పోటీలలో ధర్మవరం కవి,రచయిత ఎల్.ప్రఫుల్ల చంద్ర కవిత కు ప్రశంసా పత్రం లభించింది.ఈ సందర్భంగా కవిత రచించిన ఎల్.ప్రఫుల్ల చంద్ర మాట్లాడుతూ అలనాటి అపురూప నటుడు దివంగత మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు గారిపై ఎంత రాసినా తనివి తీరదని ఆ మహనీయుడు కే ఈ కవిత అంకితం అన్నారు.ఈ కవితల పోటీ పెట్టిన లేపాక్షి ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలియజేసారు.






# బీజేపీ జిల్లా అధ్యక్షుడి గా ద్వారపురెడ్డి

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 21:** భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులుగా కశింకోట మండలానికి చెందిన ద్వారపురెడ్డి పరమేశ్వర రావు ని రెండవసారి నియమిస్తూ రాష్ట్ర పార్టీ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. ఎంపీ సీఎం రమేష్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర పార్టీ నుండి విచ్చేసిన జిల్లా ఎన్నికల అధికారి బుద్ధ లక్ష్మి నారాయణ, పరిశీలకులుగా విచ్చేసిన రాష్ట్ర సోషల్ మీడియా ఇంచార్జి ఏ. కేశవ కాంత్ రాష్ట్ర పార్టీ తరపున నూతన అధ్యక్షుని పేరు ని పార్టీ నాయకులు, కార్యకర్తల నడుమ ప్రకటించడం జరిగింది. తర్వాత పార్టీ శ్రేణుల కోలాహలం మద్య నూతన అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు ని ప్రచార రథం పై పట్టణ పురవీధులలో ఊరేగింపు జరిపి పార్టీ కార్యాలయం నకు తీసుకురావడం జరిగింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ పార్టీ తన పై ఉంచిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నెరవేర్చి పార్టీ ని మరింతగా ప్రజలకు అందుబాటు లోకి తీసుకు వచ్చి పార్టీని విస్తరిస్తానని ప్రకటించడం జరిగింది. ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




# ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరమును ప్రజలు సద్వినియోగం చేసుకోండి

## - యువర్స్ ఫౌండేషన్ సంస్థ

**ధర్మవరం పెన్ సత్తా జనవరి 21:** ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 2వ తేదీన నిర్వహించబడే ఉచిత ఐఓఎల్ కంటి వైద్య శిబిరమును ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించు శిబిరమును సద్వినియోగం చేసుకోవాలని యువర్ ఫౌండేషన్ అధ్యక్షులు షీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్, క్యాంప్ చైర్మన్ పోలా ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు పట్టణంలోని స్వాతి క్లినిక్ లో కంటి శిబిర కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కంటి వైద్య శిబిరం యువర్స్ ఫౌండేషన్ సంస్థ-ధర్మవరం, జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీ సత్యసాయి జిల్లా, నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి బెంగళూరు (బెంగళూరు వెస్ట్ లయన్స్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 30 సంవత్సరాలుగా ధర్మవరం పరిసర ప్రాంతాల ప్రజలకు కొన్ని వేల మందికి కంటి ఆపరేషన్లను నిర్వహించి, కంటి చూపును ప్రసాదించినటువంటి నేత్ర జ్యోతి కంటి ఆసుపత్రి వారు తిరిగి మన ధర్మవరం కు వారి సేవలను అందించుటకు యువర్ ఫౌండేషన్ వారి సౌజన్యంతో రావడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో కంటి శుక్లముల ఉన్న వారిని పరీక్షించి, ఆపరేషన్లకు అర్హులైన వారిని అదే రోజున ధర్మారం నుండి బెంగళూరుకు ప్రత్యేక బస్సులో తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరానికి దాతలుగా కీర్తిశేషులు కాచర్ల హనుమంతు జ్ఞాపకార్థం వీరి కుమారుడు కాచర్ల నాగరాజు అండ్ కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా ఉచితంగా కంటినందు లెన్స్ అమర్చు, ఆపరేషన్లు చేయబడునని తెలిపారు. బిపి షుగరు గుండె జబ్బులు ఉన్నవారు తమ వ్యక్తిగత డాక్టర్ రిపోర్టును, వాడుతున్న మందుల చీటీని తేవాలని తెలిపారు.ఈ శిబిరానికి వచ్చి వారు ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, రేషన్ కార్డు జిరాక్సతో ఫోన్ నెంబర్తో రావాల్సి ఉంటుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణము, గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలు సద్వినియోగం చేసుకొని కంటి వెలుగును ప్రసాదించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో



రాధాకృష్ణ, సహకార దర్శి గొర్రె రమేష్ బాబు, డాక్టర్ బి బి. సుబ్బారావు, మాజీ అధ్యక్షులు వైకే శ్రీనివాసులు, చాంద్ బాషా, బండి నాగేంద్ర, ఖలీల్, సత్రశాల మల్లికార్జున తదితర సభ్యులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9440248192 కు గాని 9440683100 కు గాని, 9959331224 కు గాని సంప్రదించాలని తెలిపారు.

# జిల్లా పోలీసు కార్యాలయ ఆధునీకరణకు చర్యలు చేపడతాం

## - రాష్ట్ర హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత.

**విజయనగరం పెన్ సత్తా జనవరి 21:** రాష్ట్ర హెూం శాఖా మంత్రి వంగలపూడి అనిత జిల్లా పోలీసు కార్యాలయాన్ని సందర్శించి, పోలీసుల నుండి గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ రాష్ట్ర హెూం మంత్రి కి పుష్ప గుచ్చంను అందించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ జిల్లా పోలీసు, ఆర్మ్ రిజర్వు కార్యాలయాల అభివృద్ధి, ఆధునీ కరణకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాలని జిల్లా ఎస్పీని కోరారు. పోలీసు కార్యాలయం లోని ప్రతీ సీటును సందర్శించి, మినిస్టీరియల్ సిబ్బంది నిర్వర్తించే విధులు, వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ప్రతీ రోజూ ఉదయం 4 గంట లకే విధులకు హాజరవుతున్నారని, కష్టపడుతున్నారని, రేపటితో నియామక ప్రక్రియ ముగుస్తున్నట్లుగా రాష్ట్ర హెూం మంత్రి కి జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం, రాష్ట్ర హెూం శాఖా జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంను, ఆర్మ్ డ్ రిజర్వు కార్యాలయాన్ని సందర్శించారు. పోలీసు నియామక ప్రక్రియ ఏవిధంగా జరుగుతున్నది జిల్లా ఎస్పీని అడిగి తెలుసుకున్నారు. నియామక ప్రక్రియ పూర్తయితే రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖ బలోపేతం అవుతుందన్నారు. ఇటీవల రామభద్రపురం పోలీసు స్టేషనులో ఆరు మాసాల పసికందు పై అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడి పై కేసు నమోదైన ఐదు మాసాల వ్యవధి లోనే 25 సం.లు జైలుశిక్ష విధించే విధంగా ప్రాసిక్యూషను పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టినందుకుగాను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ను రాష్ట్ర మంత్రి వంగలపూడి అనిత ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాలో గంజాయి నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ఛార్జ్ షీట్స్ ను నిర్ధిష్ట సమయం లోగా న్యాయ స్థానాల్లో దాఖలు చేయాలని, కేసుల వివరాలు, దర్యాప్తు అంశాలలో ఎప్పటి సిసి కెమెరాలను, డ్రోన్స్ వినియోగించాలన్నారు. నేర నియంత్రణలో సిసి కెమెరాలు, డ్రోన్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని, సిసి కెమెరాల ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించాలని, ముఖ్య కూడళ్ళు, ప్రాంతాలు, రద్దీ ప్రదేశాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు. ఒక డ్రోన్ 20 మంది పోలీసులు చేసే పని చేసే అవకాశం ఉందని, ప్రతీ పోలీసు డ్రోన్ ఆపరేట్ చేసే విధంగా శిక్షణ పొందాలన్నారు. జిల్లాలో ప్రతీ పోలీసు స్టేషనుకు డ్రోన్ ఆవస్యకత ఉందని, త్వరలో 30 డ్రోన్స్ ను అందించేందుకు కృషి చేస్తానని జిల్లా ఎస్పీకి మంత్రి స్పష్టమైన హామీ నిచ్చారు. డ్రోన్స్ ను వినియోగించేందుకు అవసరమైన శిక్షణను త్వరిత గతిన పూర్తి చేయాలని, డ్రోన్ శిక్షణలో మహిళా పోలీసు కానిస్టేబుళ్ళకు ఎక్కువగా ప్రాధాన్యత కల్పించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ను అనిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హెూం శాఖా మంత్రి వెంట రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పల నాయుడు, విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అతిథి గజపతి రాజు, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఒఎస్టీ అనిల్ పులిపాటి, ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వర రావు, ఇతర ప్రజా ప్రతినిధులు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.











# డిప్యూటీ సీఎం పదవి పై ఎవరు మాట్లాడవద్దు పవన్

**అమరావతి పెన్ సత్తా :** డిప్యూటీ సీఎం పదవి కి దూరంగా ఉండమని జనసేన ప్రధాన కార్యాలయం తన క్యాడర్‌కు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ విషయం పై మీడియా లేదా సోషల్ మీడియాలో స్పందించ వద్దని కార్యాలయం క్యాడర్‌ను కోరారు. ముఖ్యంగా నిన్న కిరణ్ రాయల్ సోషల్ మీడియా వీడియో తర్వాత, ఇది ఒక ప్రధాన పరిణామంగా పరిగణించ బడింది. టీడీపీ కి చెందిన సోషల్ మీడియా వీడియో తో మొదలైన సమస్య లోకేష్ ను డిప్యూటీ సీఎంగా చూడాలనుకునే వారితో పాటు ఇతర నేతలు, క్యాడర్‌లో చేరడంతో ఊపందుకుంది. టీడీపీ, జనసేనలు ఎన్నికల మిత్రపక్షాలు అని, వైఎస్సార్‌సీపీ కి వ్యతిరేకంగా ఓటు వేసి



టీడీపీ కి మద్ద తిచ్చిన తన వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకే పవన్ ని డిప్యూటీ సీఎం చేశారన్న విషయం గుర్తుంచు కోవాలి. సహజంగానే, ఎన్నికల తర్వాత కేవలం నెల రోజుల తర్వాత కూటమిలో చీలికలు రావాలని పవన్ కళ్యాణ్ కోరుకోవడం లేదన్నారు. వారి ఇతర పోల్ మిత్ర పక్షమైన బిజెపి కూడా వారి కలయిక గురించి సంతోషకరమైన సహకారాన్ని అందించాలని అనుకుంటోంది. అటువంటి సంతోషకరమైన వాతావరణంలో కొందరు శత్రువులు విష బీజాలు నాటుతారని, వాటిని జనసేనకు పట్టించు కోవద్దని రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు పోదామని తెలియజేశారు. దావోస్ కు వెళ్లే ముందు జరిగిన సమావేశంలో నేరుగా వేదిక పైనే బాబును అభ్యర్థించి నప్పటికీ, ఇప్పటి వరకు టీడీపీ నుంచి అలాంటి నిర్ణయం రాలేదన్నారు. ఈ సమస్య ఇంతటితో ఆగిపోవాలని, ఇక పై ఎవరూ మాట్లాడకూడదని హెచ్చరించారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమంలో రంగాచారి

**అనకాపల్లి పెన్ సత్తా జనవరి 21:** మండలం లోని కూండ్రం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి పి. బి రంగాచారి చెరుకు పంటలను పరిశీలించారు. అదేవిధంగా చెరుకు పంట తీసిన వెంటనే నువ్వులు, మినుములు, పెసలు, ప్రొద్దు తిరుగుడు, చోడి పంట మొదలుకు పంటలు వేసుకోవాలని సూచించారు. చెరుకు, మినుములు, పెసలు, నువ్వులు పొద్దు తిరుగుడు, రాగి పంట( చౌడుపంట ) మొదలుకు పంటలు వేసిన రైతులు ఈ పంట నమోదు మీ గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు. అదే విధంగా నువ్వులు యొక్క యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు తెలియజేశారు, నువ్వులు సమగ్ర యాజమాన్యంతో నాణ్యమైన దిగుబడులు, నువ్వులలో సమగ్ర యాజమాన్య చర్యల గురించి వివరించారు. అనకాపల్లి మండల వ్యవసాయ అధికారి పి. బి రంగాచారి గ్రామ రైతు సేవ కేంద్రం వద్ద చెరుకు తోటలు, నువ్వు క్షేత్ర పరిశీలన సందర్భంగా నూనె గింజల పంటల సాగు పై శిక్షణ కార్యక్రమం



నిర్వహించారు. నూనె గింజల పంటలలో సింగిల్ సూపర్ ఫాస్పేట్ రూపంలో భాస్వరాన్ని ఎకరాకు 50 కిలోలు ఆఖరి దుక్కిలో వాడడం ద్వారా నూనె శాతాన్ని పెంచవచ్చునని వివరించారు. విత్తనానికి ట్రైకోడెర్మాతో శుద్ధి చేయడం, ట్రైకోడెర్మా పొడిని ఎకరాకు రెండు కిలోల చొప్పున ఆఖరి దుక్కిలో పశువుల గెత్తంతో కలిపి చల్లడం ద్వారా నేల ద్వారా వచ్చే వేరు కుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్లను అరికట్ట వచ్చునని తెలిపారు. విత్తిన 48 గంటల లోపు ఎకరాకు ఒక లీటరు పెండిమితాలిన్ కలుపు మందును పిచికారి చేయడం ద్వారా వెడల్పాకు కలుపు మొక్కలను రాకుండా చేయవచ్చునని సూచించారు. సరైన మొక్కల సాంద్రతను పాటించడం, ఒక్కసారైనా కలుపు తీయడం, కనీసం రెండుసార్లు తేలికపాటి తడి ఇవ్వడం ద్వారా ఇప్పుడు వస్తున్న దిగుబడిని రెట్టింపు చేసే అవకాశం ఉందని రైతులకు తెలియజేశారు, గ్రామ ఉద్యమంలో సహాయకులు సంతోష్, గ్రామ రైతులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

# భారీగా పతనమైన జొమాటో స్విగ్గీ షేర్లు

**బిజినెస్ :** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్ ఫామ్ లైన జొమాటో, స్విగ్గీ షేర్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. ఫలితాల నేపథ్యంలో జొమాటో షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోగా, దాని ప్రభావం అటు స్విగ్గీ పైనా పడటంతో రెండు కంపెనీల షేర్లు నేడు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి గానూ జమాటో ఏకీకృత నికర లాభం రూ.59 కోట్లుగా పేర్కొంది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం 57.2 శాతం క్షీణత నమోదు చేసింది. తన క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ ఆర్డర్లను త్వరితగతిన పూర్తి చేసేందుకు, దూకుడుగా స్టోర్ల విస్తరణ చేపట్టడంతో లాభం తగ్గిందని జొమాటో వివరణ ఇచ్చింది. స్టోర్ విస్తరణ కోసం పెట్టుబడులను వేగవతం చేయడం వల్ల సమీప కాలంలో నష్టాలు నమోదుకావచ్చని తెలిపింది. ఫలితాల అనంతరం బ్రోకరేజీ సంస్థలు అంచనాలను తగ్గించడంతో కంపెనీ షేర్లు 11 శాతం మేర పడిపోయాయి. క్విక్ కామర్స్ విభాగంలో పోటీ పెరుగుతున్న వేళ బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించడం కూడా షేర్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమైంది. మరో ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ షేర్లు కూడా ఈ రోజు ట్రేడింగ్ సెషన్‌లో 10 శాతానికి పైగా పతనమయ్యాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో లాభాల్లో ట్రేడయిన షేర్లు ఈ రోజు భారీగా పతనమయ్యాయి. గతేడాది స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయిన తర్వాత ఒక్క రోజు లోనే షేర్లు పెద్ద ఎత్తున క్షీణించడం ఇదే తొలిసారి.! జమాటో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా నమోదవడం కూడా స్విగ్గీ షేర్ల పై ప్రభావం చూపింది. దీంతో షేర్లు 8 వారాల కనిష్ఠమైన రూ.427 ను తాకింది. స్విగ్గీ త్రైమాసిక ఫలితాలను వెల్లడించాల్సి ఉంది. దీనికి సంబంధించిన తేదీని కంపెనీ ఇంకా వెల్లడించలేదు. 12:30 గంటల సమయంలో ఎన్ఎస్ఈలో జొమాటో షేర్లు 9.68 శాతం క్షీణించి రూ.216.55 వద్ద ట్రేడవుతున్నాయి. స్విగ్గీ షేర్లు ఎన్ఎస్ఈలో 8.83 శాతం నష్టంతో రూ.436 వద్ద ఊగిసలాడుతున్నాయి.




# కొనసాగుతున్న కానిస్టేబులు ఉద్యోగాల నియామక ప్రక్రియ ఎస్పీ తుహిన్ సిన్హా

**అనకాపల్లి, పెన్ సత్తా, జనవరి 21:** 14 రోజులుగా కొనసాగుతున్న స్టైఫెండరీ పోలీసు కానిస్టేబులు ఉద్యోగ నియామకాలు. ఈ నియామకాలు ప్రాధమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఎం.టి, పి.ఈ.టి. పరీక్షల ప్రక్రియ కొనసాగుతున్నట్లు గా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. విశాఖపట్నం, కైలాసగిరి పోలీస్ క్రీడా మైదానం నందు నిర్వహించిన 14 వ రోజు పరీక్షలకు 485 మంది పురుష అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారని, వారిలో 310 మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు అర్హత సాధించారన్నారు. నియామకాల ప్రక్రియ వేకువ జామున 5 గంటల నుండే ప్రారంభం కావడం, ప్రణాళికా బద్ధంగా వ్యవహరించడంతో, పరీక్షలు సకాలంలో పూర్తయ్యా







యన్నారు. పోలీసు నియామకాల ప్రక్రియను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్వయంగా పర్యవేక్షించారు. అభ్యర్థులకు ముందుగా హాల్ టిక్కెట్ లను పరిశీలించి, పోలీసు పరేడ్ గ్రౌండు లోకి అనుమతించారు. అనంతరం, అభ్యర్థుల విద్యార్హతలు, రిజర్వేషన్లు, వయస్సు నిర్ధారించే ధృవ పత్రాలను పరిశీలించి, అన్ని సర్టిఫికేట్స్ సక్రమంగా ఉన్న అభ్యర్థులకు మాత్రమే బయోమెట్రిక్ తీసుకొని, పి.ఎం.టి. పరీక్షలకు అనుమతించామన్నారు. ఆధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన డిజిటల్ ఇక్విప్మెంట్స్ వినియోగించి, అభ్యర్థుల ఎత్తు, ఛాతీ కొలతలను నిర్ధారించి, అర్హత సాధించిన అభ్యర్థులకు పి.ఈ.టి. పరీక్షలను అనుమతించామని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో అడిషనల్ ఎస్పీ ఎల్.మోహన్ రావు, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వర రావు, ఇన్స్పెక్టర్ లు టి.లక్ష్మి, ఎల్.మన్మధ రావు, బి.రామకృష్ణా రావు, ఐ.టి కోర్ ఎస్సై బి.సురేష్ బాబు, పీ.ఈ.టీలు, ఇతర పోలీసు అధికారులు, పోలీసు కార్యాలయ ఉద్యోగులు పాల్గొని, ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగే విధంగా విధులు నిర్వహించారు.

# జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు ముదిగుబ్బ మండలంలో పర్యటన

**ముదిగుబ్బ పెన్ సత్తా జనవరి 21:** సత్యసాయి జిల్లా ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండలంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్. సుమారు 300 జనాభా కలిగిన జొన్నల కొత్తపల్లి తాండ కు నేటికీ సరైన రహదారి లేకపోవడం బాధాకరమని. తండావాసులు ఎదుర్కొంటున్న సమస్యలను నెలలోగా



పరిష్కరిస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ మంగళవారం మండ పరిధి లోని జొన్నల కొత్తపల్లి తాండలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో తెలిపారు. దశాబ్దాలుగా సరైన సౌకర్యాలు మౌలిక వసతులు రాకపోకలు సాగించడానికి రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నామని ఈ విషయాన్ని స్థానిక, జిల్లా అధికారుల దృష్టికి తెచ్చిన ఫలితం లేకపోవడంతో, స్థానిక యువకులు జాతీయ ఎస్టీ కమిషన్ దృష్టికి తీసుకొని రావడంతో గ్రామ పరిస్థితిని పరిశీలించడానికి వచ్చామన్నారు, రహదారి సమస్యను రాష్ట్ర ట్రైబల్ వెల్ఫేర్ సెక్రెటరీ దృష్టికి తీగ రహదారి నిర్మాణానికి అనుమతులు, నిధులు మంజూరు అయ్యాయని, ఆ స్థలం ప్రైవేట్ రైతులకు చెందినది కావడంతో ఆలస్యం అవుతోందని నెలలోగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపినట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు,అలాగే గ్రామంలోని ప్రజల సౌకర్యార్థం పక్కా ఇళ్ల నిర్మాణం, అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు, వచ్చే నెల నుండి ప్రభుత్వ చౌక దుకాణాన్ని తండాలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు, తండావాసులు ఎదుర్కొంటున్న సమస్యలను నెలలోగా పరిష్కరిస్తామని ఎస్టీలకు ఇబ్బంది పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు ఈ సందర్భంగా తాండావాసులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఎమ్మార్వో నారాయణస్వామి, సేవే నాయక్, తిరుపాల్ నాయక్, అంజి నాయక్, నాగిరెడ్డి, పలువురు గిరిజన నాయకులు అధికారులు పాల్గొన్నారు. తమ గ్రామానికి విచ్చేసిన జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ కు గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు.

# ప్రతి కుటుంబానికి వందరోజులు పనిదినాలు కల్పించాలి కలెక్టరు

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 21:** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎస్.) ద్వారా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు పై డుమా, హౌసింగు, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఎన్.ఆర్.ఇ.జి.ఎస్. నిధులతో చేపట్టిన పల్లె పండుగ పనులను సకాలంలో పూర్తిచేయాలని తెలిపారు. లక్ష్యం మేరకు ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలను కల్పించాలని, ఇండ్ల నిర్మాణం చేసుకొనే లబ్దిదారులకు 90 రోజులు పనిదినాలు కల్పించాలని తెలిపారు. రోడ్లు, ఫారం పాండ్స్, ఇంకుడు గుంతలు, పట్టు పరిశ్రమ షెడ్డలు, గోకులం షెడ్డులు, పల్లె వనాలు, అంకుడు కర్ర పెంపకం, వ్యవసాయ అనుబంధ పనులు లక్ష్యం మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో డుమా ప్రోజెక్టు డైరెక్టరు ఆర్. పూర్ణిమా దేవి, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.వి.నాయుడు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.బి. రామమోహన రావు, హౌసింగు ప్రోజెక్టు డైరెక్టరు వై. శ్రీనివాస్, ఎపిఒలు, ఎపిడి.లు పాల్గొన్నారు.



# జాతీయ స్ఫూర్తి ఉట్టిపడేలా గణతంత్ర దినోత్సవ వేడుకలను నిర్వహించాలి

**అనకాపల్లి,పెన్ సత్తా, జనవరి 21:** జాతీయ స్ఫూర్తి ప్రస్ఫుటించేలా 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 26 వ తేదీన అనకాపల్లి ఎన్.టి.ఆర్. స్టేడియంలో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహించుటకు ఏర్పాట్లు చేయాలన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధిత శాఖల సమన్వయంతో సకాలంలో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వేడుకల నిర్వహణకు నిర్ధేశించిన మినిట్ టు మినిట్ అనుసరించి ఏర్పాట్లు ఉండాలన్నారు. అలాగే ప్రధాన వేదికు సంబంధించి ఏర్పాట్లు, ప్రొటోకాల్ కు అనుగుణంగా రూపొందించాలన్నారు. రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే అతి ముఖ్య అతిధులకు, విఐపిలు, ఇతర ప్రజా ప్రతినిధులకు, సాధారణ ప్రజానీకానికి, ప్రత్యేక గ్యాల రీలు, సీట్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జాతీయ స్ఫూర్తి, సమగ్రత ఉట్టిపడేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై స్టాల్స్ లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల ద్వారా జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల పై ప్రగతిని కనబర్చేవిధంగా ఆకర్షణీయంగా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. అందరి సమిష్టి కృషితో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టరు తెలిపారు. సమావేశంలో ఎస్.పి. తుహిన్ సిన్హా, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, జిల్లా రెవిన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు, అనకాపల్లి, నర్సీపట్నం ఆర్ డి ఒ లు షేక్ ఆయిషా, వివి రమణ, ఎఎస్పి దేవప్రసాద్, సిపిఒ జి.రామారావు, కలెక్టరేట్ ఎఒ బి.వి. రాణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.






# చంద్రబాబు కృషి తో విశాఖ ఉక్కుకు ఆర్థిక భరోసా

**అచ్యుతాపురం పెన్ సత్తా జనవరి 21:** ఉత్తరాంధ్రాకి కాక, యావత్ ఆంధ్ర రాష్ట్రానికి మణిహారం విశాఖ కర్మాగారం అని, వేలాదిమంది రైతులు వీరోచిత పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్ అని రాష్ట్ర రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వర రావు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ప్రగడ మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ని స్టీల్ ప్లాంట్ ప్రైవేట్ కరణ పేరుతో పడిన కష్టాలను అడ్డుకొని ప్లాంట్ పునర్జీవం చేయడానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం ఢిల్లీ కి వెళ్ళినప్పుడు వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప ఏనాడూ రాష్ట్ర ప్రయోజనాల కోసం వెళ్లలేదని, నేడు అందుకు భిన్నంగా సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ కి వెళ్లి రాష్ట్ర ప్రయోజనాలు సాధిస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఢిల్లీకి వెళ్లిన వచ్చిన ప్రతిసారి ఆంధ్రప్రదేశ్ కి కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్తూనే ఉంది అని, నేడు ఆర్థిక సంక్షోభంలో పోడుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడేందుకు 11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయాలి, ఉక్కు ఆస్తులు అమ్ముకోవాలని గత ముఖ్యమంత్రి, గత ప్రభుత్వం ప్రయత్నిస్తే, విశాఖ ఉక్కును ఏ విధంగా పరిరక్షించాలని చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారం లోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ ఉక్కు పరిశ్రమ పై ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు. ఈ సంక్షోభం నుంచి గెట్టెక్కాలంటే 18 వేల కోట్ల అవసరమని, విశాఖపట్నం పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంపీ భరత్, తదితరులు విన్నవించిన కొద్ది రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జిఎస్టి చెల్లింపులుకు 500 కోట్లు, ముడిసరుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు 1,150 కోట్లు చొప్పున మొత్తం 1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సాయం అందించిందన్నారు. నేడు విశాఖ స్టీల్ ప్లాంట్ ను సంక్షోభం నుంచి ఆదుకునేందుకు చంద్రబాబు కృషి ఫలితంగా 11,440 కోట్లు సాయాన్ని కేంద్రం ప్రకటించడం అభినందియమని తెలిపారు. ఉక్కు కర్మాగారానికే రికార్డు స్థాయిలో లాభాలు వచ్చేలా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేయడం జరిగిందని 2002 లో అప్పటి కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా పేర్కొందని, అప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది, నేడు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో నుంచి స్టీల్ ప్లాంట్ ను గట్టి ఎక్కించింది చంద్రబాబు అని, తప్పుడు మాటలతో వైసిపి ఎంత దుష్ప్రచారం చేసినా ఆంధ్రప్రదేశ్ ప్రజలు మాటలు వినే పరిస్థితిలో లేరని తెలిపారు.



# మద్యం డిపోను తనిఖీ చేసిన కొల్లు రవీంద్ర

**పెందుర్తి పెన్ సత్తా జనవరి 21:** పెందుర్తి మండలం జెర్రిపోతుల పాలెం గ్రామంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరైజేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ విశాఖపట్నం ఐఎంఎఫ్ఎల్ డిపో -2 ను పరిశీలించడానికి వచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర కి ఘన స్వాగతం స్థానిక పలికిన పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. ఈ కార్యక్రమంలో పెందుర్తి నియోజవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొని ఘన స్వాగతం పలికారు.




# మంజూరైన పనులు వెంటనే పూర్తిచేయాలి జిల్లా కలెక్టరు

**అనకాపల్లి, పెన్ సత్తా జనవరి 21:** పంచాయతీ రాజ్ శాఖకు మంజూరైన పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను అదేశించారు. మంగళవారం కలెక్టరు కార్యాలయ సమావ్వేశ మందిరంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగు అదికారులతో జిల్లా కలెక్టరు సమీక్షాసమావేశం నిర్వహించారు. సమావేశంలో మండల వారీగా మంజూరైన పనులు, పూర్తయిన పనులు, పూర్తయిన పనులకు సంబంధించి బిల్లులు సమర్పణ, పెండింగు పనులు, బిల్లుల పై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులను పేమెంటు కొరకు వెంటనే సమర్పించాలని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమంలో మంజూరైన పనులన్నింటిని వెంటనే పూర్తిచేయాలని తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారం నాటి కి పనులన్నింటిని పూర్తి చేసి బిల్లులు అప్లోడ్ చేయాలని జిల్లా కలెక్టరు ఇంజనీర్లను ఆదేశించారు. ప్రస్తుతం మంజూరెట్కన రోడ్లు, కల్వర్టులు, కాలువలు మొదలైన పనులు పూర్తి చేసిన తరువాతే కొత్త పనులకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. సమావేశంలో పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కె.వి.నాయుడు, డివిజినల్ ఇంజనీర్లు, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు.






# మెట్రో కేం పరిశ్రమలో అగ్నిప్రమాదం

**పరవాడ పెన్ సత్తా జనవరి 21:** మండలం లోని జవహర్లాల్ నెహ్రూ ఫార్మాసిటీ లో మెట్రో కేం ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమంలో మంగళవారం తెల్లవారుజాము వి టి పి సాల్వెంట్ ట్యాంకులు లో మంటలు ఎగిసిపడి ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం పై సమగ్ర విచారణ చేయాలని భద్రతా ప్రమాణాలను పాటించని యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. 2024 నవంబర్ రెండో తేదీన కూడా ఈ పరిశ్రమలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయని, ఈ ప్రమాదంలో కూడా కార్మికులకి ఏ విధమైన గాయాలు జరగలేదన్నారు. కానీ ఈ ప్రమాద తీవ్రత భారీ ఎత్తున జరిగిందని భద్రత ప్రమాణాలు పాటించడానికి యాజమాన్యాలు చర్యలు చేపట్టకపోతే కార్మికులు క్షణక్షణం భయాందోళనలో విధులు నిర్వహిస్తున్నారని, భద్రత ప్రమాణాలు పాటించడానికి యాజమాన్యాలు పెద్దపీట వేయాలని గని శెట్టి డిమాండ్ చేశారు. కార్మికులకు రక్షణ భద్రతా సంక్షేమం గురించి యాజమాన్యాలు పట్టించు కోవడం లేదని లాభాలే పరమార్ధంగా వ్యవహరిస్తున్నాయని గనిశెట్టి మండిపడ్డారు. సమగ్ర విచారణ చేసి యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు కమిటీలు వేసి నివేదికలు బయట పెట్టడం లేదని, నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని గనిశెట్టి ఆరోపించారు. ఇప్పటికైనా యాజమాన్యాల పై చర్య తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.





PEN SATTA
Telugu Daily

పెన్ సత్తా

తెలుగు దిన పత్రిక

Anakapalli
22-01-2025

## దిల్ రాజు టార్గెట్‌గా ఐటీ దాడులు



టాలీవుడ్ బడా నిర్మాత దిల్ రాజు టార్గెట్ గా మంగళవారం తెల్లవారుజామున ఆదాయపన్ను శాఖ సోదాలు మొదలయ్యాయి. బడా నిర్మాతగానే కాకుండా తెలంగాణ ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా వ్యవహరిస్తున్న రాజుపై ఆదాయపన్ను శాఖ దాడులు చేస్తోందన్న వార్తలు అటు సినీ ఇండస్ట్రీతో పాటు ఇటు పొలిటికల్ సర్కిళ్లలోనూ హాట్ టాపిక్ గా మారింది. దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయనకు చెందిన కార్యాలయాలపైనా ఐటీ అధికారులు ఏకకాలంలో సోదాలు మొదలుపెట్టారు. దిల్ రాజుతో పాటుగా శిరీష్, దిల్ రాజు కుమార్తె హన్షిత రెడ్డిల ఇళ్లు, కార్యాలయాలపైనా ఐటీ అధికారులు మూకుమ్మడిగా సోదాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం పలు బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు హైట్కదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో ఆకస్మిక దాడులను చేపట్టారు. ఫలితంగా నగరంలోని బంజారా హిల్స్, జూబ్లీ హిల్స్, గచ్చిబౌలి, కొండాపూర్ తదితర ప్రాంతాల్లో కలకలం రేగింది. మొత్తంగా నగరంలోని 8 ప్రాంతాల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. ఈ సంక్రాంతికి తెలుగులో ప్రధానంగా మూడు సినిమాలు రిలీజ్ కాగా.. వాటిలో రెండు దిల్ రాజు నిర్మించినవే ఉన్నాయి. గ్లోబల్ స్టార్ రాంచరణ్ తేజ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన గేమ్ ఛేంజర్ వాటిలో భారీ బడ్జెట్ చిత్రం కాగా%ా% విక్టరీ వెంకటేశ్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన సంక్రాంతికి వస్తున్నాం చిత్రం బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ రెండు సినిమాలను దిల్ రాజే నిర్మించారు. ఈ రెండు సినిమాలు హిట్ టాక్ తెచ్చుకోగా.. దిల్ రాజుకు భారీ ఎత్తున లాభాలు వచ్చినట్లుగా సమాచారం.

## రింకు సింగ్ పెళ్లి




టీమిండియా టి20 బ్యాట్స్‌మెన్ రింకు సింగ్ ఇంటి వాడు కాబోతున్నాడు. సమాజ్ వాదీ పార్టీకి చెందిన ఎంపి ప్రియ సరోజ్‌ను రింకు పెళ్లి చేసుకోబోతున్నారని ఆమె తండ్రి, ఎంఎల్ఎ తుఫాని సరోజ్ తెలిపారు. రింకు, ప్రియకు నిశ్చితార్థం జరిగినట్టు సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను తొలుత ఖండించిన ఆయన చర్చలు జరుగుతున్నాయని వివరణ ఇచ్చారు. రెండు కుటుంబాలు పెళ్లికి అంగికరించాయని చెప్పారు. గత సంవత్సరం నుంచి ఇద్దరు మధ్య పరిచయం ఉండడంతో ప్రేమగా మారింది. పార్లమెంటు సమావేశాల తరువాత లక్నోలో నిశ్చితార్థం జరుపుతామని ప్రియ తండ్రి తెలిపారు. సమాజ్ వాదీ పార్టీ తరుపున మచిలీషహర్ నుంచి ఎంపిగా గెలిచారు. ఆమె గతంలో సుప్రీంకోర్టు న్యాయవాదిగా సేవలందించారు. ఆమె తండ్రి తుపానీ మూడు సార్లు ఎంపిగా పని చేశారు. రింకు సింగ్ ఇంగ్లాండ్‌తో జరిగే టి20 సిరీస్‌కు ఎంపికయ్యారు.

## అధ్యక్ష ప్రమాణ స్వీకారం చేయగానే అమెరికేతరులకు షాప్ ఇచ్చిన ట్రంప్

### - భారతీయులకు పెద్ద బ్యాడ్ న్యూస్.

అమెరికా: అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ దేశం లోని ఇమ్మిగ్రెంట్లకు చెమటలు పట్టిస్తున్నారు. ఏ క్షణంలో ఎలాంటి బాంబు లాంటి వార్తను ట్రంప్ ప్రకటిస్తారో తెలియక హడలిపోతున్నారు. ఈ క్రమం లోనే పుట్టుకతో అమెరికా పౌరసత్వం పై ఆయన ఫోకస్. ఈ విషయం భారతీయులను కూడా ఆందోళనకు గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే జనవరి 20 న 47 వ అమెరిగా దేశాధ్యక్షుడిగా పదవిలో ఎంట్రీ ఇచ్చిన ట్రంప్ తొలి రోజునే అనేక కార్యనిర్వాహక ఉత్తర్వుల పై సంతకం చేశారు. వీటిలో చాలా వరకు అమెరికన్ల పైనే ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారు. మరికొన్ని పొరుగు దేశాల పై ఈ క్రమంలో ట్రంప్ విధించిన సుంకాలు కెనడా, మెక్సికో వంటి దేశాలను ప్రభావితం చేస్తున్నాయి. ఇక్కడ అన్నింటి కంటే ఎక్కువగా ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న అంశం పుట్టుక తోనే అమెరికా పౌరసత్వాన్ని రద్దు చేయటమే. బర్త్ రైట్ సిటిజన్షిప్ అంటే ఏంటి? గతంలో అమెరి



కా గడ్డ పై పుట్టిన ప్రతి బిడ్డకు ఆటోమెటిక్‌గా యూఎస్ పౌరసత్వం లభించేది. దీనినే జన్మతహ పౌరసత్వం పొందటం అని అంటారు. అమెరికా రాజ్యాంగంలో 14 వ సవరణ ద్వారా ఈ నిబంధన పొందుపరచ బడింది. విదేశీ తల్లి దండ్రులకు అమెరికాలో జన్మించిన వారు సైతం ఈ నిబంధన కింద జన్మహక్కు పౌరసత్వాన్ని పొందుతారని రాజ్యాంగ సవరణ వెల్లడిస్తుంది. ఈ సవరణను జూన్ 13, 1866 న యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన సంగతి తెలిసిందే. 1861-1865 అంతర్యుద్ధం తర్వాత నల్లజాతీయులకు సమాన పౌర, చట్టపరమైన హక్కులను కల్పించే లక్ష్యంతో దీనిని తీసుకురావటం జరిగింది. దీని కింద అప్పటి నుంచి అమెరికాలో పుట్టిన ఇతర జాతుల పిల్లలకు సైతం అమెరికాలో పుట్టినట్లయితే వారికి పౌరసత్వం ఇవ్వటం కొనసాగుతూ వచ్చింది. అయితే అందరికీ ఇలా జన్మతహ పౌరసత్వాన్ని అందించే ఏకీకృత విధానాన్ని ముగించాలని ప్రస్తుతం ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ చూస్తోంది. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ వల్ల ఇక పై ఎవరైనా వ్యక్తి అమెరికా భూ భాగంలో జన్మించినప్పటికీ వారికి ఆటో మెటిక్ గా పౌరసత్వం మంజూరు చేయబడదని చెబుతోంది. దీనికింద ప్రకటింటిన నిబంధనలను పరిశీలిస్తే. పిల్లవాడు పుట్టిన సమయంలో తల్లి అమెరికాలో చట్ట వ్యతిరేకంగా నివసిస్తూ, బిడ్డ తండ్రి అమెరికా పౌరుడు కాకపోవటం లేదా ఆ సమయంలో శాశ్వత నివాసి కాకపోతే సదరు బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇక పై అందించబడదని తెలుస్తోంది. 2. రెండవ పరిస్థితిని పరిశీలిస్తే అమెరికాలో బిడ్డకు జన్మనిచ్చిన తల్లి తాత్కాలికంగా టూరిస్టుగా, విద్యార్థి వీసా పై లేదా పనిచేస్తున్నట్లయితే సదరు పుట్టిన బిడ్డకు వారసత్వం లభించదు. ఇదే సమయంలో సదరు బిడ్డ తండ్రి అమెరికా పౌరుడు కాకపోవటం లేదా ఆ సమయంలో శాశ్వత నివాసి కాకపోతే సిటిజన్షిప్ స్వయంచాలకంగా లభించదు. ట్రంప్ తన కొత్త పౌరసత్వ ఆర్డర్ పై సంతకం పెట్టడంతో అమెరికాలో నివసిస్తున్న భారతీయులు సైతం ఆందోళన చెందుతున్నారు. తమ పై ఎలాంటి ప్రభావం ఉంటుందనే ఆందోళనలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. తాజా ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ఇప్పుడు అమెరికాలో జన్మించిన వలసదారుల పిల్లల పై ప్రభావం చూపే అవకాశం ఉందని తెలుస్తున్న వేళ యూఎస్ లోని భారతీయ జంటల పై ప్రభావం చూపే అవకాశం ఉంది. చాలా మంది అమెరికాలో తాత్కాలిక వీసాల పై నివశించటం వల్ల సమస్య పెద్దదిగా కనిపిస్తోంది. కొత్త ఆర్డర్ 30 రోజుల్లో అమలులోకి రానుంది. ఈ మధ్య పుట్టే పిల్లలకు ఇది వర్తించదు.

## 70 గంటల పని కామెంట్ పై దిగొచ్చిన మూర్తి

### - 40 ఏళ్లుగా చేసింది అదే.



**బిజినెస్ :** కొన్ని నెలల కిందట దేశంలో యువత వారానికి 70 గంటలు పనిచేయాలంటూ పిలుపు నివ్వటం పెద్ద చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. దీని పై చాలా కాలంగా కొనసాగుతున్న చర్చ పై చివరికి నారాయణ మూర్తి వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. వారానికి ఒక వ్యక్తి ఇన్ని గంటలు పనిచేయాలనేది వ్యక్తిగత విషయమని, తప్పనిసరిగా 70 గంటలు చేయాలని ఎవరూ చెప్పరని, హార్డ్ వర్క్ అనేది వ్యక్తిగత ఎంపికగా పేర్కొన్నాడు. ప్రజలు తమ పని గురించి ఆత్మపరిశీలన చేసుకోవాలని, చేసే పనిపట్ల కమిట్మెంట్ గురించి ఆలోచించాలని పేర్కొన్నారు. ఇది ఉద్యోగిని కెరీర్ లో ముందుకు తీసుకెళ్లటానికి దోహదపడుతుందని అన్నారు. బాహాటంగా దీని గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం లేదని వ్యక్తిగత విషయంగా ఇన్ఫోసిస్ నారాయణమూర్తి పేర్కొన్నారు.

తాను ఇన్ఫోసిస్ కంపెనీలో 40 ఏళ్లపాటు ప్రతి రోజూ ఉదయం 6.30 కి వెళ్లి సాయంత్రం 8.30 వరకు పనిచేసేవాడినని పేర్కొన్నారు. తన జీవిత ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఇది వాస్తవమని ఇది వ్యక్తిగత ఎంపికని అన్నారు. ఇలాగే చేయాలి లేదా చేయకూడదు అని ఎవ్వరూ చెప్పరని తాను వారానికి 70 గంటలు పనిచేసిన రోజులను గుర్తుచేసుకున్నారు. కొద్ది రోజుల ముందు ఎల్ అండ్ టి చైర్మన్ సుబ్రహ్మణియన్ వారానికి 90 గంటలు పనిచేయాలని, ఆదివారాలు ఇంటి వద్ద భార్య ముఖం చూసుకుంటూ సమయం వృధా చేయ్యొద్దని కామెంట్స్ చేసిన క్రమంలో నారాయణమూర్తి తాజా కామెంట్స్ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. వర్క్ లైఫ్ బ్యాలెన్స్ చాలా ముఖ్యమనే అంశం పై చాలా పెద్ద డిబేట్ జరుగుతోంది. యజమాని అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేయాల్సిన అవసరం తమకు లేదంటూ చాలా మంది ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారవేత్తలు కష్టపడి దేశానికి పన్నులు చెల్లించటం వల్లనే పేదరికంలో ఉన్న ప్రజలను పైకి తీసుకురావటానికి ఆ డబ్బు ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ భారతదేశంలో 60 శాతం మంది ప్రజలు ఉచితంగా అందించే రేషన్ సరకుల పైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఈ క్రమంలో పెట్టుబడిదారీ విధానం విశ్వసనీయత గురించిన ఆందోళనలను కూడా మూర్తి ప్రస్తావించారు. కార్పొరేట్ దురాశ ప్రజల అపనమ్మకానికి మూలకారణమని పేర్కొన్నారు.

వర్క్ లైఫ్ బ్యాలెన్స్ పై ప్రముఖుల అభిప్రాయాలు ఆర్ జి పి ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ హర్ష్ గోయెంకా వర్క్‌లైఫ్ బ్యాలెన్స్ విజయానికి సంబంధించిన వంటకం కాదని అన్నారు. ఇదే క్రమంలో ఐటీసీ లిమిటెడ్ చైర్మన్ సంజీవ్ పూరి ఉద్యోగులు పని గంటల సమయం కంటే వారి సామర్థ్యాన్ని గ్రహించి, మంచి పనితీరును కనబరచడం చాలా ముఖ్యమని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

## అదరగొట్టిన భారత మహిళా జట్టు మలేషియా పై ఘన విజయం

**కౌలాలంపూర్ :** అండర్-19 టీ 20 ప్రపంచ కప్‌లో భారత మహిళా క్రికెట్ జట్టు గెలుపు దిశగా కొనసాగుతోంది. వెస్టిండీస్ పై గెలిచి శుభారంభం చేసిన భారత్. మంగళవారం మలేసియాతో జరిగిన రెండో మ్యాచ్ లోనూ తలపడి ఘన విజయాన్ని సాధించింది. ముందుగా భారత బౌలర్లు విజి, అంభించడం తో మలేషియా 14.3 ఓవర్లలో 31 పరుగులకే ఆలౌటైంది. మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటనలు: భారత మహిళా క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన చేసి మలేషియా జట్టును తక్కువ స్కోర్‌కే పరిమితం చేసింది. భారత స్పిన్నర్ల దాడికి మలేషియా బ్యాటింగ్ ఆర్డర్ పూర్తిగా కూలిపోయింది. మలేషియా జట్టు కేవలం 22 పరుగులకే ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. ఈ లక్ష్యాన్ని భారత జట్టు కేవలం 17 బంతుల్లోనే చేజిక్కించుకోవడం గమనార్హం. అయితే ఈ మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన ఒకటి చోటు చేసుకుంది, అది నో బాల్ పై మలేషియా బ్యాటర్ ఔట్ కావడం. మలేషియా పై బౌలింగ్ చేసిన భారత స్పిన్నర్లు చెలరేగిపోయారు. ఈ క్రమంలో మలేషియా బ్యాటర్ నుని ఫారిని సఫ్రీని జోషిత ఔట్ చేసింది.అయితే నాలుగవ ఓవర్లో విచిత్రమైన సన్నివేశం జరిగింది. మలేషియా వికెట్ కీపర్ నూర్ అలియా, వ్యక్తిగతంగా 5 పరుగుల వద్ద, నో బాల్ పై రనౌట్ అయింది. ఆ లెగ్ నో బాల్‌కు షాట్ ఆడిన ఆమె, పరుగు కోసం పిచ్ పై ముందు కెళ్లగా, భారత ప్లేయర్ పరుణికా సిసోడియా ఆమెను రనౌట్ చేసింది. ఇది మ్యాచ్‌లో ఆసక్తికర మలుపుగా నిలిచింది. నూర్ అలియా ఔట్ అయిన వెంటనే, మలేషియా జట్టు మరింత బలహీనమైంది. మలేషియా జట్టు రనౌట్ తర్వాత కొద్ది సేపటికే వరుస వికెట్లు కోల్పోయింది. 6 బంతుల్లో మూడు వికెట్లు పడిపోయాయి. భారత బౌలర్ ఆయుషి శుక్లా రెండు కీలక వికెట్లు తీసి మలేషియా జట్టును దిగజార్చింది. హుస్నా, సఫికా, కెప్టెన్ నూర్ డానియా, నురిమాన్ హిదయా వెంటవెంటనే



అవుటయ్యారు. ఈ పరిణామాలతో 10 ఓవర్లకు ముందే మలేషియా జట్టు 6 వికెట్లు కోల్పోయింది. ఈ మ్యాచ్ భారత జట్టుకు పెద్దగా కష్టమేమీ కాలేదు. మలేషియా పై 9 వికెట్ల తేడాతో సునాయాసంగా విజయం సాధించింది. తొలి మ్యాచ్ లోనూ భారత జట్టు తన సత్తా చాటింది. అంతేకాదు, వెస్టిండీస్ తో జరిగిన మ్యాచ్ లోనూ ఘన విజయం సాధించింది. భారత జట్టు విజయవంత మైన ప్రదర్శనతో తమ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. నూర్ అలియా హైరున్ (5), హుస్నా (5) పరుగులు చేశారు. ఈ స్వల్ప లక్ష్యాన్ని భారత్ 2.5 ఓవర్ల లోనే వికెట్ కోల్పోకుండా ఛేదించింది. తెలుగమ్మాయి గొంగడి త్రిష (27లిబీ 12 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసింది. కమలిని (4లి) పరుగులు చేసింది. భారత బౌలర్ వైష్ణవి శర్మ (5/5) సంచలన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. ఆమె తన చివరి ఓవర్‌లో నూర్ ఐన్ బింటి రోస్లాన్ (3), నూర్ ఇస్మా డానియా (0), సితి నజ్వా (0)ను పెవిలియన్‌కు పంపి హ్యాట్రిక్ సాధించింది. ఆయుషి శుక్లా (3/8) అదరగొట్టింది. వైష్ణవి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో (జనవరి 23) శ్రీలంకతో తలపడనుంది.

"PEN SATTA" Telugu Daily Printed, Published and owned by CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Published at D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. and Printed at Chaitanya Vaaradhi Printers, Do.No.2-99, Bharinikam, Paravada, Anakapalli, Visakhapatnam-531 021. Editor : CHINTAMANENI ANILKUMAR, D.NO.1-1, RAJULA ILLA PAKKANA,VENKATAPURAM, THANAM POST, MUNAGAPAKA MANDAL, ANAKAPALLI, VISAKHAPATNAM, ANDHRAPRADESH-531021. Cell : NO.APTEL/2023/87729, E-mail:anilchintamaneni@gmail.com